26 వరకు జర్నలిస్టుల ఇళ్లస్థలాల దరఖాస్తు గడువు

శ్రీకాకుళం : పలు కారణాలతో ఇళ్లస్థలాలకు దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులకు మరో వారం రోజులు గడువు పొడిగించినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్ల స్థలాలను అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే 535 జిఒను జారీ చేసిందని గుర్తుచేశారు. ఆ జిఒలో పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని, ప్రభుత్వం అందించే ఇళ్ల స్థలాలను పొందాలని తెలిపారు. ప్రస్తుతం చేసుకునే దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

అధ్యక్షునికీ తప్పని అసమ్మతి

వై నాట్ 175 అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అంటుంటే, జిల్లాలో వై నాట్ అస్మమతి అన్నట్లుగా నాయకుల తీరు ఉంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో ఒక్కో నియోజకవర్గంలో వైసిపి నాయకులు తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఇప్పటికే ఎచ్చెర్ల, పాతపట్నం, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో అధికార పార్టీలో పలురూపాల్లో అసమ్మతిని వ్యక్తపరుస్తున్న పరిస్థితి ఉంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను అధిష్టానం ప్రకటించకపోవడంతో అక్కడ పరిస్థితి గుంభనంగా ఉంది. తాజాగా ఆ జాబితాలో నరసన్నపేట చేరింది. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను మార్చాలనే నినాదం తాజాగా ఊపందుకుంది. చివరకు వైసిపి జిల్లా అధ్యక్షునికీ అసమ్మతి తప్పలేదు.

- నరసన్నపేట ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్‌పై తిరుగుబాటు
- అభ్యర్థిని మార్చకపోతే భవిష్యత్ కార్యాచరణ
- అధిష్టానానికి అసంతృప్త నాయకుల అల్టిమేటం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో కచ్చితంగా గెలిచే సీట్లలో నరసన్నపేట ఒక నియోజకవర్గంగా పార్టీ అధిష్టానం ఇప్పటివరకు లెక్కలు వేసుకుంటోంది. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ గెలుపునకు ఎటువంటి ఢోకా ఉండదని భావిస్తూ వస్తోంది. అయితే నరసన్నపేటలోని ఒక కళ్యాణ మండపంలో అసమ్మతి నాయకులు కృష్ణదాస్‌కు వ్యతిరేకంగా సోమవారం సమావేశం కావడం పార్టీ వర్గాలకు షాక్ ఇచ్చినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల నాటి నుంచి ఉన్న అసమ్మతి చాప కింద నీరులా విస్తరించింది. తొలుత పోలాకి మండలంలో ప్రారంభమైన అసంతృప్తి సెగలు నియోజకవర్గమంతటా వ్యాపించాయి. పోలాకి మాజీ ఎంపిపి తమ్మినేని భూషణ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిపి టిక్కెట్ ఆశించారు. స్థానిక ఎన్నికలపై కోర్టు స్టే ఇవ్వడంతో ఆయన తన సొంత గ్రామం సుసరాం సర్పంచ్‌గా పోటీ చేశారు. సర్పంచ్ పదవిపై వేరొకరికి మాట ఇస్తే వినకుండా భూషణ్ పోటీ చేయడంపై కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సర్పంచ్ ఎన్నికల్లో భూషణ్ ఓడిపోయినా, తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన భార్య తమ్మినేని శారద ఎంపిటిసిగా గెలుపొందారు. ఆమెకు ఎంపిపి పదవి ఇచ్చేందుకు కృష్ణదాస్ ససేమిరా అన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. సారవకోటలో ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్, జలుమూరు జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, నరసన్నపేట మండలానికి చెందిన ముద్దాడ బాలభూపాల్ నాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిధి పరిగ బావాజీనాయుడు ఇలా అందరూ కృష్ణదాస్ వైఖరిపై లోలోపల మండిపోతున్నారు. దీంతో వారంతా ఒక్కటై కృష్ణదాస్‌పై అసమ్మతిగళం వినిపిస్తున్నారు.

మితిమీరిన కుటుంబ జోక్యం



కృష్ణ దాస్‌కు వ్యతిరేకంగా నాయకులంతా గళం విప్పడానికి రకరకాల కారణాలు విని పిస్తున్నాయి. ముఖ్యంగా పార్టీ వ్యవహారాల్లో కుటుంబ జోక్యం విపరీతంగా పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలి నుంచి పార్టీని నమ్ముకున్న వారికి పదవుల్లో మొండిచేయి చూపారన్న ఆగ్రహం అసమ్మతి నాయకుల్లో కనిపిస్తోంది. పార్టీలో తనకు నచ్చిన వారికి పదవులు ఇచ్చి, మిగిలిన వారిని దూరం పెట్టడంపై వారంతా గుర్రుగా ఉన్నారు. బదిలీలు, చిన్నపాటి ఉద్యోగాలు వంటి రకరకాల పనుల కోసం వెళ్తున్న మండల, గ్రామస్థాయి నాయకులకు ఎమ్మెల్యే సతీమణి పద్మప్రియ నుంచి చేదు అనుభవం ఎదురవుతున్నట్లు అసమ్మతి నాయకులు చెప్తున్నారు. తాము సూచించిన పేర్లను పక్కనపెట్టి ఆమెకు నచ్చిన విధంగా చేస్తున్నారన్న ఆగ్రహం వారిలో వ్యక్తమవుతోంది. పార్టీ కోసం కష్టపడి, జేబులో డబ్బులు ఖర్చు చేసిన వారికి ఎటువంటి పనులూ ఇవ్వకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. దాని ఫలితమే నేడు వారంతా సమావేశమై, కృష్ణదాస్‌కు టిక్కెట్ ఇవ్వవద్దనే స్థాయికి చేరిందన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

సమావేశమైన అసంతృప్త నాయకులు

అధిష్టానానికి అల్టిమేటం

కృష్ణదాస్‌పై నెలకొన్న అసమ్మతిపై పార్టీ అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాల్సి ఉంది. కృష్ణదాస్‌కు టిక్కెట్ ఇవ్వవద్దని, కొత్త వారికి ఎవరికి ఇచ్చినా గెలుపు కోసం ఐక్యంగా పనిచేస్తామని అసమ్మతి గ్రూపు నాయకులు ముక్తకంఠంతో చెప్తున్నారు. కృష్ణదాస్‌కు ఇస్తే మాత్రం తాము సహకరించబోమని తేల్చిచెప్తున్నారు. పార్టీ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే తాము భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామంటూ అధిష్టానానికి అల్టిమేటం సైతం జారీ చేశారు. నరసన్నపేట టిక్కెట్ కోసం సారవకోట ఎంపిపి చిన్నాల కూర్మినాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ డోల జగన్ తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఎటువంటి నిర్ణయం తీసుకోనుందో చూడాల్సి ఉంది.

ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

ఆశావర్కర్లుగా మార్పు చేయాలి

ఐటిడిఎ వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట, శ్రీకాకుళం

గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న 2,361 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశావర్కర్లుగా మార్పు చేయాలని, రూ.10 వేల వేతనం చెల్లించాలని సిఐటియు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, డి.రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, ఆశాలతో సమానంగా వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సీతంపేట ఐటిడిఎ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గౌరవ వేతనం రూ.నాలుగు వేలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వేతనంతో వారి కుటుంబాన్ని ఏవిధంగా పోషించాలని ప్రశ్నించారు. యూనిఫాం, రికార్డ్స్ మెడికల్ కిట్స్, టిఎ, డిఎలు ఇవ్వడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కేవలం రూ.నాలుగు వేలు వేతనం ఇస్తూ సంక్షేమ పథకాలు నిలుపుదల చేయడం దుర్మార్గమన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ ప్రయాణపు ఖర్చులు ఇవ్వాలని, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. అనంతరం డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతికి వినతిపత్రం అందించారు. ధర్నాలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం.కాంతారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, ఎన్.అప్పన్న కె.భాస్కరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయుకులు ఎస్.మాలతి, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయుకులు హైమావతి, ఎస్.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారారని పెన్షన్లు తీసేశారు

'స్పందన'లో టిడిపి నేత గౌతు శిరీష ఫిర్యాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పలాస నియోజకవర్గం పరిధిలోని సరియాపల్లిలో ఇటీవల అధికార పార్టీని వీడి టిడిపిలో చేరారన్న అక్కసుతో పెన్షన్లు తొలగించారని ఆసరా సాయాన్ని తొలగించారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు ఫిర్యాదు చేశారు. సరియాపల్లి గ్రామ సర్పంచ్ డి-పట్టా భూముల్లో అనధికారికంగా లేఅవుట్లు వేస్తున్నారని ఫిర్యాదు చేశారు. మహాదేవపురం సమీపాన చెరువులో ఎటువంటి అనుమతుల్లేకుండా మట్టిని తవ్వి ఇసుక బట్టీలకు వైసిపి నాయకులు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 216 వినతులు వచ్చాయి. వంశధార భూసేకరణలో పరిహారం చెల్లింపు సమయంలో పేరు తప్పుగా నమోదు కావడం వల్ల నేటికీ అందలేదని, న్యాయం చేయాలని వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన దుగ్గుపురానికి చెందిన సుందరరావు వినతిపత్రం అందజేశారు. ఎచ్చెర్లలోని సాంఘిక సంక్షేమశాఖ గురుకులంలో పనిచేస్తున్న కంటిన్‌జెన్సీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళా కార్మికులు వినతినిచ్చారు. భూ వివాదాలు, రీ సర్వేలో లోపాలను సరిదిద్దాలని కోరుతూ పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని, సత్వరమే పరిష్కరించాలని జెసి అధికారులను ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. ప్రత్యేక ఉప కలెక్టర్ మహాలక్ష్మి, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్, డ్వామా పీడీ చిట్టిరాజు, డిఇఒ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ పీడీ గణపతిరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి నవీన్

వైసిపి పాలనలో ప్రజాధనం లూటీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రూ.లక్షల కోట్ల ప్రజాధనం లూటీ చేశారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ఆరోపించారు. జగన్ అవినీతి పాలనపై టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విసిరిన సవాల్‌ను స్వీకరించగలరా అని ప్రశ్నించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలో రూ.లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చి లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తే, ఉన్న పరిశ్రమలను జగన్ అటకెక్కించారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టడానికి గొడ్డలిపోటు, కోడికత్తి డ్రామా ఆడిన జగన్, ఈసారి ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందని తెలిసి దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలకు అమలు చేసిన 125 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. ప్రజలపై ధరలు, పన్నుల భారాన్ని పెంచిన జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి లేకుండా చేశారని విమర్శించారు. దీనివల్ల వృద్ధిరేటు గణనీయంగా తగ్గిందన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బి.భాస్కరరావు, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, వి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

9న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అన్ని కోర్టుల్లో మార్చి తొమ్మిదో తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే పోలీస్ యంత్రాంగానికి పెద్ద కేసులపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణిభూషణ్ భాస్కరరావు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మల్లేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నాగభూషణరావు, తంగి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు
- రూ.265 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. రూ.265 కోట్ల మంచినీటి పథకానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో కలిసి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ప్రాజెక్టు మ్యాప్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగువాడలో రూ.265 కోట్లతో ఈ బృహత్తర తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం తనకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి వంశధార జలాలను పంపించి ముఖ్యమంత్రి జగన్ ఈ ప్రాంత ప్రజలకు అపర భగీరథుడు అయ్యారన్నారు. 448 గ్రామాలకు లబ్ధి చేకూరే ఈ పథకం గురించి గడిచిన ప్రభుత్వాలు కనీస ఆలోచన చేయలేదని విమర్శించారు. వచ్చే ఏడాదిలో గానే గొట్టాబ్యారేజీ ద్వారా లిఫ్టులు ఏర్పాటు పూర్తి చేసి, వంశధార రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి, మన వాటా జలాల 19 టిఎంసిల నీటిని సద్వినియోగం చేసుకొని శ్రీకాకుళం జిల్లాను అపర అన్నపూర్ణ జిల్లాగా మారుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, ధర్మాన కృష్ణదాస్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, పంచాయతీరాజ్ ఎస్ఇ టి.శ్రీనివాస్ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ఇఇ జి.జె బెనహర్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ అర్.వెంకట్రామన్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా 'దుంపల'

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్ర కళింగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మండలంలోని తోలాపికి చెందిన దుంపల రామారావు (లక్ష్మణరావు)ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన పేరాడ తిలక్‌ను వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడంతో ఇటీవల ఆయన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ పదవి రామారావును వరించింది. రామారావు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసి కొన్నేళ్ల కిందట స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలో ప్రారంభమైన ఆలిండియా బిసి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఈ పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందుకు సహకరించిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ధన్యవాదాలు తెలిపారు. కళింగుల అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రామారావుకు ఐహెచ్‌ఆర్ఎఐ రాష్ట్ర అధ్యక్షులు పప్పల రామ్మోహనరావు, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి దామోదరరావు, తోలాపి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో రామారావు

అనధికార ఎత్తిపోతలపై కోర్టును ఆశ్రయిస్తా

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వంశధార నదిపై అనధికారికంగా నిర్మించిన ఎత్తిపోతల పథకాలతో శివారు భూముల రైతులకు అన్యాయం జరుగుతోందని, వారికి న్యాయం చేయడానికి కోర్టును ఆశ్రయిస్తామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పల్లిసారథి, చినవంక, డోకులపాడు, నగరంపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు శివాజీ అసమర్థక కారణంగా శివారు గ్రామాల రైతాంగం నష్టపోయిందన్నారు. నాడు అనధికార ఎత్తిపోతల పథకాలను వ్యతిరేకించి ఉంటే, ఈరోజు రైతులకు ఇబ్బందులు ఉండేవి కావని చెప్పారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుతో జిల్లాకు నయాపైసా ఉపయోగం లేదన్నారు. వైసిపి ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు ఇంగ్లీష్ రాదని అచ్చెన్నాయుడు విమర్శించడం తగదన్నారు. ప్రజలకు మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. పేరాడ తిలక్ మాట్లాడుతూ జన్మభూమి కమిటీల దోపిడీకి పట్టం కడతారో, వాలంటీర్ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సేవలందించే వైసిపి పాలన కావాలో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిది పి.శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్, పలాస ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, సర్పంచ్‌లు బత్తిన కుసుమ, వి.సరిత, డి.పద్మావతి, ఎంపిటిసిలు బి.రాజేశ్వరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, నోడల్ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలన్నారు. 4,500 రిజిస్ట్రేషన్ కాలేదని మూడు రోజుల్లో పూర్తి చేయాలని పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను ఆదేశించారు. అత్యధికంగా అర్బన్ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఎంపిడిఒలతో సమన్వయం చేసుకొని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో పెండింగ్‌లో ఉన్న ఫారం-6, 7, 8 పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా లోపాలకు తావీయొద్దని సూచించారు.

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 27,600 రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 2చ167 డాక్యుమెంట్లు సరిగా లేక రిజిస్ట్రేషన్లు తిరస్కరించినట్లు చెప్పారు. కోర్టు కేసులు ఉన్నవి పక్కన పెట్టి మిగిలినవి పూర్తి కావాలని ఆదేశించారు. రెవెన్యూ వెరిఫికేషన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రీ సర్వేను పూర్తి చేయాలన్నారు. రీ సర్వే మూడో దశకు సంబంధించి కొత్తగా రావాల్సిన, రివైజ్డ్ ప్రతిపాదనలు పంపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ కార్డులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిసిఇ నగేష్, సిపిఒ లక్ష్మీప్రసన్న, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, ప్రకాశరావు, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 3rd ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY COURT AT SRIKAKULAM
OS 3/2013

Between: **Puppala Satyavathi and another** --Plaintiffs
And: **Kota Venkata Rao and others** --Defendants

To,
1. Velamala Indhrasena rao, S/o Prasada rao, hindu, aged 50 years, business, R/o Jogipeta village, Narasannapeta mandalam, srikakulam district. (D-8)
2. Ponnana Prasada rao, S/o Tatayya, hindu, aged 51 years, business R/o Jammu village, Narasannapeta mandalam, srikakulam district (D-10)
3. Voonna Venkata Govinda rajulu, s/o Suryanarayana, hindu, aged 50 years, business R/o Indiranagar colony, Narasannapeta mandalam, srikakulam district (D-11)
4. Ponnana Ramesh, S/o Tavitayya, aged 40 years, hindu, R/o Jogipeta village, Narasannapeta mandalam, srikakulam district. (D-12)

Please take notice that the above OS3/2013 was posted to **26/02/2024** for your appearance in the above said court. you are all informed to appear on the said date **at 10:30 AM** in person or through advocate and if you fails to appear therefore said matter will be decided Exparte on merits
(Order of the Honourable court)

B.MADANA MOHANA RAO
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9440828340

మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

లక్ష్యాల పూర్తికి కృషి

ప్రజాశక్తి- పలాస

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లల్లో లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, మున్సిపల్ సచివాలయం అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు మండలంలోని రామకృష్ణాపురం, తర్లాకోట ప్రాంతాల్లో జగనన్న ఇళ్ల స్థలాలు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు చేయడంలో జాప్యం జరుగుతోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న లబ్ధిదారులు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.వి.వి.ఎస్.నాయుడు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఎంపిడిఒ ఎం.వైకుంఠరావు, టిపిఒ అప్పలరాజు, ఆర్ఐ నిరంజన్, విఒఆర్‌ఒలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- మందస

సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గున్న రమేష్, ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోస్టుకార్డు ఉద్యమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సిపిఎస్ రద్దు అంశంపై మేనిఫేస్టోలో పెట్టువారికి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం సాకుగా చూపడం సరికాదన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేసిందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్పు చక్రధరరావు, లండ రాజారావు, కె.రమణమూర్తి, పి.మల్లిఖార్జునరావు, మజ్జి కుమారస్వామి పాల్గొన్నారు.


అర్జీదారునితో మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రేమ్‌కాజల్

పోలీసు స్పందనకు 34 వినతులు

శ్రీకాకుళం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే స్పందనలో భాగంగా అదనపు ఎస్‌పి డాక్టర్ ప్రేమ్‌కాజల్ నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులు సమస్యలను అదనపు ఎస్‌పి ముందు విన్నవించుకోగా, ఆమె సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. బాధితులకు చట్టపరిశీలోని సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలియజేయాలన్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు 6, చీటింగ్ 3, ప్రాపర్టీ 8, పాతది 10, ఇతర అంశాలపై 7, మొత్తం 34 ఫిర్యాదులు అందాయి.

అర్బన్ హెల్త్ సెంటర్లు పూర్తయ్యేదెప్పుడో?

సూదికొండలో శ్లాబ్‌తో నిలిచిపోయిన అర్బన్ హెల్త్ సెంటర్

- సూదికొండలో శ్లాబ్‌స్థాయిలో నిలిచిన వైనం
- గృహాల్లోనే నడుస్తున్న హెల్త్ సెంటర్లు

ప్రజాశక్తి- పలాస

పట్టణ ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా భవనాలను మంజూరు చేసింది. రెండేళ్లు కావస్తున్న భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ అద్దె నివాసగృహాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సూదికొండ ప్రాంతంలో హెల్త్ సెంటర్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. మండలంలోని మొగిలిపాడు, సూదికొండ, జగనన్న కాలనీలో ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.80 లక్షలు నిధులను మంజూరు చేశారు. ఒక వైపు అర్బన్ హెల్త్ సెంటర్లు త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రారంభించి రోగులకు వైద్య సేవలు అందించాలని ఉన్నత అధికారులు చెబుతున్నారు. కానీ, మండలస్థాయి అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహించడంతో నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ప్రస్తుతం మొగిలిపాడు, రామకృష్ణాపురం జగనన్న లేఅవుట్‌లో పనులు చివరి దశకు చేరుకోగా, సూదికొండ ప్రాంతంలో శ్లాబ్ వేసి పనులు నిలిచిపోయాయి.

నివాసాలే హెల్త్ సెంటర్లు

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో నర్సిపురం, శివాజీనగర్, హట్కో కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అవీ నివాస గృహాలు కావడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న మందులు, సామగ్రి ఉంచేందుకు స్థలం సరిపోవడం లేదు. మరోవైపు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేలకు వేలు భవనాలకు అద్దెలు చెల్లిస్తున్నా పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నివాసగృహాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు పెట్టడం ద్వారా మున్సిపాలిటీ ప్రజలకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయా? అనే విషయం కూడా తెలియని పరిస్థితి. ఏదేమైనప్పటికీ నివాసగృహాల్లో హెల్త్ అర్బ సెంటర్లో నిర్వహించడం ద్వారా రోగులకు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. అర్బన్ హెల్త్ సెంటర్లకు పక్కా భవనాలు లేకపోవడం వల్లే ఇటువంటి ఇబ్బందులు వస్తున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరతిగతిన అర్బన్ హెల్త్ సెంటర్లో భవనాలను పూర్తి చేసి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలతో పాటు వైద్య అధికారులు కోరుతున్నారు. ఈ విషయం పై మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌ను వివరణ కోరగా, మొగిలిపాడు పూర్తయిందని, జగనన్న లేఅవుట్‌లో అర్బన్ హెల్త్ సెంటర్లు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు. సూదికొండలో శ్లాబ్ వేశామని అన్నారు. త్వరితగతిన హెల్త్ సెంటర్లు పూర్తి చేసి అర్బన్ హెల్త్ సెంటర్లకు అప్పగిస్తామని తెలిపారు.

శివాజీనగర్‌లో అద్దె భవనంలో నడుస్తున్న హెల్త్ సెంటర్

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- పోలాకి

సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సోమవారం పలు అభివృద్ధి పనులకు, భవనాలను ప్రారంభించారు. ముందుగా తలసముద్రంలో రూ.70 లోలతో సచివాలయం, విలేజ్‌హెల్త్ సెంటర్, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. ఈదులవలస నుంచి ముప్పిడి వరకు రూ.6.15 కోట్లతో బిటి రోడ్డు, రూ.11.80 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించారు. సంతలక్ష్మీపురం పంచాయతీలో రూ.47 లక్షలతో ఇంటింటికీ కుళాయి, రూ.పది లక్షలతో సచివాలయం భవనం ప్రారంభించారు. పల్లిపేట పంచాయతీలో రూ.25 లక్షలతో సచివాలయం భవనం ప్రారంభించారు. కొత్తరేవు పంచాయతీలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్, రూ.21.80 లక్షల తో రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. రేగుపాడు, బెలమర, చెల్లాయివలస, గంగివలస గ్రామాల్లో సచివాలయాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు, చింతాడ ఉమా, చింతు రాఘవ, ఎస్.సోమేశ్వరరావు, బి.గడ్డియ్య, బొజ్జ జగన్నాథం, బోసు రమణ, మిత్తన శ్రీను, కె.శ్రీను పాల్గొన్నారు.

తలసముద్రంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

జగన్ హామీలు బూటకం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

గౌతు శిరీష

పలాస : ఒక్కఛాన్స్ అని అధికారం ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలను నరకం చూపించిన సిఎం జగన్మోహన్‌రెడ్డి, మరలా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ బూటకపు హామీలు ఇస్తున్నారని, ఆ హామీలను ప్రజలు నమ్మొద్దని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. చట్టాలను తన చుట్టలుగా చేసి ప్రశ్నించిన ప్రతి వారిపై తప్పుడు కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఏమి అభివృద్ధి చేశాడని జగన్‌కు ఓటువేయ్యాలని ప్రశ్నించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కోటబొమ్మాళి: విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో ప్రయివేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, ఓసీ తరగతుల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో వీరికి 25 శాతం సీట్లు కేటాయించామన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు అర్హత గల విద్యార్థుల ఆధార్ వివరాలతో హెచ్‌టిటిపి.పిఎస్ఇ.ఎపి, జివోవి. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సమీప మండల ఎంఇఒ కార్యాలయాన్ని గాని, 18004258599 టోల్ ఫ్రీ నంబరులో గాని సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి

మాట్లాడుతున్న పరమేశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీ పున: నిర్మాణంలో భాగంగా విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, జిల్లా పరిశీలకులు మీసాల సుబ్బన్న, డోల శ్రీనివాసరావు, గుత్తుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాలతో పార్టీ విధానాన్ని ప్రజల మధ్యకు తీసుకు వెళ్లాలని, కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాల నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేయాలని కోరారు. ఎన్నికల్లో ఎవరికి పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇచ్చినా సమిష్టిగా పనిచేసి ప్రజలకు దగ్గరవ్వాలన్నారు. సమావేశంలో పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పైడి నాగభూషణరావు, అంబటి కృష్ణ, గోవింద, మల్లిబాబు, రెళ్ళ సురేష్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

దుష్ప్రచార పోస్టులపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పలాస

వైసిపి సోషల్ మీడియాలో ప్రతినిధులు టిడిపి నాయకులపై దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలాస, వజ్రపుకొత్తూరు మండలాల టిడిపి నాయకులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. 2016లో నువ్వలరేవు-మంచినీళ్లపేట బ్రిడ్జికి జిఒ నంబరు 366 ఇస్తూ... అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దీన్ని మార్పు చేసి వైసిపి సోషల్ మీడియా టిడిపిపై అసత్య ప్రచారానికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనికి సంబంధించిన సోషల్ మీడియా క్లిప్పింగ్‌లు జతపరుస్తూ... వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టిడిపి నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, బి.శశిభూషణరావు, మరడ దుర్యోధన పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్యదర్శి మృతి

సుదర్శనరావు (ఫైల్)

ప్రజాశక్తి- పలాస

పలాసలో నివాసం ఉంటున్న గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి బొడ్డేపల్లి సుదర్శనరావు (58) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతుడు అనకాపల్లి జిల్లా మాకవరంపాలెం మండలం మాకవరపాలెం పంచాయతీలో గ్రేడ్-1 కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో పలాస మండలం బ్రాహ్మణతర్ల, అమలకుడియా, బంటుకొత్తూరు, టెక్కలిపట్నం, లొద్దభద్ర, కవిటి మండలం జగతి ప్రాంతాల్లో కార్యదర్శిగా పనిచేశారు. ఇటీవల గ్రేడ్-1 కార్యదర్శులకు బదిలీ చేయడంతో మాకవరపాలెం ప్రాంతానికి వెళ్లిపోయారు. మృతుడికి భార్య నీలవేణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నీలవేణి టెక్కలి జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. సుదర్శనరావు మృతి చెందడంతో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ సంతాపం తెలిపారు.

విచారిస్తున్న ఎంఇఒ రాజేంద్రప్రసాద్

విద్యార్థులపై అసభ్యకర ప్రవర్తన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న సెంట్ ఆన్స్ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్న సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు వి.వి.ఎస్. నారాయణరావును విధుల నుంచి తొలగించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. పాఠశాలలో 6, 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులను ఉపాధ్యాయుడు వేధిస్తున్నట్లు వారి తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. సోమవారం విద్యార్థినుల తల్లిదండ్రులు విలేకరులకు సమాచారం అందించి పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడు నారాయణరావుపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సిస్టర్ సుజాతను కోరారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుడును విచారిస్తుండగా తల్లిదండ్రులు ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుడును తొలగించి పాఠశాల నుంచి బహిష్కరించారు. ఈ సంఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు శాంతించారు. సామాజిక మాధ్యమాల్లో ఈ విషయం చక్కర్లు కొట్టడంతో మండల విద్యాశాఖాధికారి జి.రాజేంద్రప్రసాద్ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ నుంచి ఫిర్యాదులను స్వీకరించి విచారించారు. ఈ సందర్భంగా ఎఇఒ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

నేడు ఉద్యోగుల ర్యాలీ

మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదేళ్లుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో అనుసరిస్తున్న వైఖరి ఉద్యోగ వర్గాలను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని, ఉద్యోగులు ప్రభుత్వానికి సహకరిస్తూ సహనంతో ఉన్నారని ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా జెఎసి చైర్మన్, ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు ఉద్యోగుల సహనాన్ని ప్రభుత్వ పెద్దలు తేలికగా చూస్తున్నారన్నారు. సహనం నశించడం వల్లే ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నా, ర్యాలీలో పెద్దసంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు రావాల్సిన డిఎ బకాయిలను గత ఐదేళ్లలో చెల్లించలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగుల జీతభత్యాల కోసం ప్రకటించే పిఆర్‌సిలో ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారన్నారు. దేశ చరిత్రలో పిఆర్‌సి ద్వారా ఉద్యోగుల జీతాలు తగ్గించిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. 12వ పిఆర్‌సి కోసం కొత్త కమిటీ నియమించడంతో పాటు ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో సంఘాల నాయకులు చల్లా శ్రీనివాసరావు, కె.భానుమూర్తి, డి.రామ్‌మోహనరావు, శంకరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర, కిషోర్ కుమార్, గొంటి గిరిధర్, బి. శ్రీరామ్‌మూర్తి, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు పార్వతీశం, ధనుంజయరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నినాదాలు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆచార్య ఎన్.జి.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఎఆర్ఎస్, ఆర్ఎఆర్ఎస్, కెవికెలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆచార్య ఎన్‌జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్షులు ఎన్.సీతామహాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆచార్య ఎన్‌జి రంగ పరిశోధనా స్థానం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రీసెర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను రీసెర్చ్ స్టేషన్లలో నమోదు చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఏడాది మొత్తం ఉపాధి చూపించాలని, కార్యాలయంలో స్వీపర్, అటెండర్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇస్తున్న ప్రమాద సహజ మరణ నష్టపరిహారాన్ని కాంట్రాక్ట్ లేబర్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి త్రివేణి, చిట్టిబాబు, అంబటి యుగంధర్, గణపతి పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అనంతపురం జిలా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి విలేకరి కృష్ణపై ఆదివారం జరిగిన దాడిని ఖండిస్తూ సంఘీభావం తెలుపుతూ టెక్కలి ప్రెస్‌క్లబ్ సభ్యులు సోమవారం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ముందుగా టెక్కలి అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బాలమురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు, గనియా శ్రీనివాసరావు, సుంకు గోపీనాథ్, బగాది వాసుదేవరావు, పద్మలోచనం పాల్గొన్నారు.

ఆమదాలవలస : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణ, టివి 5 రిపోర్టర్ అనీల్ కుమార్‌పై వైసిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్యని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఒక ప్రకటనలో ఖండించారు. అధికారంలో ఉన్న నాయకులు పత్రికా రంగాన్ని గౌరవించకుండా దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేకమన్నారు. విలేకరులు వారి వృత్తిధర్మాన్ని పాటించడం కూడా నేరంగా చూస్తే ఎలా అని ప్రశ్నించారు.

టెక్కలి రూరల్ : వినతపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చారిత్రక రచన 'హర్షవల్లి'

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవిల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ప్రపంచ వ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ ఆలయ చరిత్ర సంస్కృతులకు సంబంధించిన సమగ్రమైన గ్రంథం ఇంతవరకు రాలేదన్నారు. నల్లి ధర్మారావు హర్షవల్లి పేరుతో ఈ గ్రంథాన్ని తీసుకురావడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా చరిత్ర, సంస్కృతికి సంబంధించిన విషయాలను వెలికితీయడం ద్వారా భావితరాలకు రచయితలు ఎంతో మేలు చేసిన వారవుతారన్నారు. ఎంతో పరిశోధన చేసి, ఈ గ్రంథాన్ని రచించిన ఆయన మరెన్నో రచనలు చేయాలన్నారు.. సోమవారం పేపర్‌సిటీలో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కళింగాంధ్ర సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గురుగుబిల్లి లోకనాథం అధ్యక్షత వహించారు. కవిగా, రచయితగా, జర్నలిస్టుగా జిల్లా చరిత్ర, సంస్కృతికి సంబంధించిన కొన్ని గ్రంథాలను ఇప్పటికే ధర్మారావు రాశారని లోకనాథం గుర్తు చేశారు. అనంతరం ధర్మారావును దుశ్శాలువతో మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో డికె చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దుప్పల రవీంద్రబాబు, ఎస్-ఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సూర శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది పాలిశెట్టి మురళీకృష్ణ, బొడ్డేపల్లి మోహనరావు, శిమ్మ రాజశేఖర్, ఉదయభాస్కర్, ఎఎంసి చైర్మన్ మూకల్ల తాతబాబు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

అన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవిల్లి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి అదనపు పిఎస్ కావలిపాటి రవిశంకర్ తన తల్లి కృష్ణవేణి జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. రెవిన్యూ మంత్రి ధర్మాన చేతులమీదుగా చెక్కును పాలక మండలి సభ్యులు మండవిల్లి రవికి అందజేశారు.

బాబు వస్తేనే ప్రజలకు భద్రత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పోవాలని, చంద్రబాబు అధికారంలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. సోమవారం గార మండలం తండ్యాలపేటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు పాలనలో అందించిన సౌకర్యాలు వివరించారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సమస్యల పరిష్కారంలో ముందుంటా మన్నారు. వైసిపి పాలనలో వేధింపులు, సాధింపులు తప్ప ప్రజలకు అందించింది శూన్యమన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు కైబడి రాజు, గోర సురేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ వెంకటరావు, మాజీ ఎంపిటిసి దుంగ జయమ్మ, నాయకులు దుంగ రమణ, అందవరపు హరి, ఆనంద్, లక్ష్మి, దుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న లక్ష్మీదేవి

ముత్యాలపేటలో ఆలయ ప్రతిష్ట

పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ముత్యాలపేటలో అమృతవర్షిణి మహా మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగిన ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

బూర్జ : మండలంలోని మదనాపురంలో సోమవారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఉన్న కాశీ విశ్వేశ్వర పంచాయన ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పురోహితులు నేతేటి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుమారు 3వేల మందికి మహాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేటలో సర్పంచ్ గొండు రమణమూర్తి ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి రెండవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతలపేట, దండేవలస, వెదుళ్ల వలస, తిమ్మాపురం, లక్ష్ముడు పేట గ్రామాల నుంచి యాత్రికులు పాల్గొన్నారు. గొండు శ్యామలరావు, భాస్కర రావు, రామారావు, మురళీధర్, గురుగుబెల్లి శ్యామలరావు, చలపతిరావు, పైడి హరీష్ పాల్గొన్నారు.

బూర్జ : పాల్గొన్న యాత్రికులు

బంగారం షాపులో చోరీ

44 కేజీల వెండి అపహరణ

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండల కేంద్రంలో శ్రీలక్ష్మి జ్యూయలర్ షాపులో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. చోరీకి పాల్పడిన వ్యక్తుల వద్ద తుపాకులు ఉన్నట్లు సిసి ఫుటేజ్ పరిశీలించిన పోలీసులు వెల్లడించారు. మండల కేంద్రమైన సరుబుజ్జిలి జంక్షన్‌లో శ్రీ లక్ష్మీ జ్యూయలర్స్ షాపు వెనుక భాగం నుంచి గుర్తు తెలియని దండగులు ప్రవేశించి సుమారు 44 కేజీల వెండి ఆభరణ ములు, రూ.పదివేలు నగదు అపహరించినట్లు షాపు యజమాని బొడ్డేపల్లి హరిబాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన ఆమదాలవలస సిఐ జి.దివాకర్ యాదవ్ స్థానిక ఎస్ఐ బి.నిహార్ షాపు వద్దకు చేరుకొని చోరీ ప్రాంతాన్ని, దొంగలు ప్రవేశించిన షాపు వెనుక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపుల్లో సిసి కెమేరాలు పరిశీలించారు. జ్యూయలర్ షాపులో ఉన్న సిసి కెమేరాను పరిశీలించగా షాపులోకి ప్రవేశించిన దుండగులు ఎటువంటి ఆనవాలు దొరక్కుండా ఒంటిని కప్పుకుంటూ దుస్తులు ధరించడంతో పాటు ముఖానికి మాస్కులు, చేతికి గ్లౌజులు ధరించి, దుండగుల వెనుక భాగంలో చిన్నపాటి తుపాకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అలాగే శ్రీకాకుళం నుంచి ప్రత్యేక క్లూస్ టీం సంఘటన జరిగిన ప్రాంతానికి వచ్చి వేలిముద్రలు సేకరించారు. శ్రీకాకుళం డిఎస్‌పి వై.శృతి చోరికి గురైన షాపును సందర్శించి షాపు యజమాని నుంచి పలు వివరాలను తెలుసుకుని షాపులో చోరీకి గురైన ప్రాంతాలను పరిశీలించారు. పోలీసు ప్రత్యేక జాగిలాలు షాపు నుంచి వెనుక భాగంలో ఉన్న చర్చి వీధి గుండా నందికొండ వీధిలోకి ప్రవేశించి వంశధార కుడి కాలువ వరకు వెళ్లి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రతగా ఉండడంతో అక్కడనుంచి వెనుతిరిగి సరుబుజ్జిలి జంక్షన్‌లో ఒక భవంతి పైకి వెళ్లి ఆగిపోయాయి.

షాపును పరిశీలిస్తున్న డిఎస్‌పి శృతి

పార్టీలో చేరిన వారితో రవికుమార్

టిడిపిలో 20 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- పొందూరు

మండలం రాపాకలో రజక సామాజిక వర్గానికి చెందిన సుమారు 20 కుటుంబాలు సోమవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో శ్రీకాకుళంలో ఆయన నివాసంలో టిడిపిలో చేరారు. గత ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిచేందుకు కృషి చేశామని, తమకు ఎటువంటి ప్రయోజనాలు కలగలేదని దీంతో విసుగుచెంది టిడిపిలో చేరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారందరికి టిడిపి కండువాలు వేసి రవికుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రతినిధి కండాపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కొంచాడ బుజ్జి, పైడి వాసు, వైకుంఠరావు, కృష్ణ, సూర్యారావు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జ్ఞానభారతి సీనియర్ సెకండరీ పాఠశాలలో ఈస్టుకోస్టు రైల్వే నిర్వహించు 'వికసిత్ భారత్, వికసిత్ రైల్వే' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు స్పందన లభించింది. 'డివిజనల్ రైల్వే మేనేజర్ ప్రమోద్' పర్యవేక్షణలో పాఠశాల కార్యదర్శి జోహర్‌ఖాన్ ఆధ్వర్యాన ఆరు నుంచి తమ్మిదో తరగతి విద్యార్థులకు సోమవారం ఇంగ్లీష్, హిందీ, ఒరియా భాషల్లో అభివృద్ధి చెందుతున్న భారత్, రైల్వేపై వ్యాసరచన, చిత్రలేఖనం, కవితల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మక నైపుణ్యాలను కనబరిచేందుకు దోహదపడుతుందని జోహర్‌ఖాన్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అరసవల్లి ఆలయంలో చిత్ర బృందం

అరసవల్లి సన్నిధిలో సిద్ధార్థరాయ్ చిత్ర యూనిట్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం ఉదయం సిద్ధార్థరాయ్ చిత్ర యూనిట్ సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. చిత్రంలో హీరోగా నటించిన దీపక్ సరోజ, హీరోయిన్ తన్వినెగితో పాటు పలువురు నటీనటులు సందర్శించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం ఆలయ సాంప్రదాయ బద్ధంగా స్వామివారి శేష వస్త్రాలను కప్పి ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి జ్ఞాపికలను అందజేశారు.

మాట్లాడుతున్న జగబందు దొలాయి

గుర్తింపు వచ్చే వరకు పోరాటం

ప్రజాశక్తి- కవిటి

బెంతు ఒరియాలకు గుర్తింపు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని తలతంపర సర్పంచ్ డాక్టర్ జగబందు దొలాయి తెలిపారు. 54 రోజులుగా కవిటిలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సహచర మిత్రులకు సోమవారం సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారం కానీ, బెంతు ఒరియాల సమస్యకు రాజకీయ పార్టీల అలసత్వమే ప్రధాన కారణమని ఆరోపించారు. ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల, నిరుద్యోగుల బంగారం లాంటి భవిష్యత్ కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. లేదంటే తమ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభాకర్ దొలాయి, పురుషోత్తం దొలాయి తదితరులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కలెక్టర్‌ను కలిసిన నాయకులు

సంతబొమ్మాళి : ఇటీవల బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ప్రతినిధి సుగ్గు రామిరెడ్డి, భావనపాడు సర్పంచ్ బుడ్డా మోహన్‌రెడ్డి, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు జీరు బాబూరావు ఉన్నారు.

వినీల్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పవన్ కళ్యాణ్

పవన్ కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- లావేరు

జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ఎచ్చెర్ల జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్, ఆయన తల్లి జనసేన నాయకురాలు కాంతిశ్రీ సోమవారం విశాఖపట్నం నోవాటల్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాంతిశ్రీ చిన్న కుమారుడు వినీల్ విశ్వంబర్ దత్తు రచించిన ఆన్‌టైరి పుస్తకాన్ని పవన్ ఆవిష్కరించారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుమ్మాడాంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తనవంతు సాయంగా రణస్థలం సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు సుత్తి సంతోష్‌తో కూడిన సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన కల్పించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎం.వి తిలక్ అన్నారు. సోమవారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో ప్రజలందరికీ ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని, ఒటిపి, పిన్ నెంబర్లను ఇతరులతో చర్చించకుండా గోప్యత పాటించాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలు బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో లీడ్ జిల్లా మేనేజర్ ఎం.సూర్య కిరణ్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యాన జిల్లాలో ఆరు సిఎఫ్ఎల్ కేంద్రాలు నడుస్తున్నాయని, కొత్తగా ఆరు కేంద్రాలను వివిధ మండలాల్లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కేంద్రాల ద్వారా బ్యాంకుల్లో అందించే సేవింగ్, రుణ, బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిఎఫ్ఎల్ కేంద్రాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సిఎఫ్ఎల్ నోడల్ ఆఫీసర్ పి.అనిల్ కుమార్, సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ స్టేట్ కో-ఆర్డినేటర్ కె.అశోక్, జిల్లా సమన్వయకర్త హరినాథ్ పాల్గొన్నారు.

సిఎఫ్ఎల్ కేంద్రాల పోస్టర్లను విడుదల చేస్తున్న తిలక్

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

నందిగాం: మండలంలోని నందిగామలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత నూతన కేంద్రాన్ని పెద్దతామరపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ మురళీమోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో ఉన్న ఖాతాదారులకు బ్యాంకు సేవలపై పూర్తి అవగాహన కల్పించడానికి వివిధ రకాలైన కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి సీనియర్ సిఎఫ్ఎల్ కౌన్సిలర్ అప్పలనాయుడు, నందిగం సిఎఫ్ఎల్ కార్యాలయానికి చెందిన సలాన జోగేంద్రనాయుడు, ఎం.రాములమ్మ, రేగల కూర్మారావు, సంజీవరావు, కొల్లి శ్రీరాములు, సర్వేపల్లి అప్పారావు, ఎం.సింహాచలం పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న గాంధీ మందిరం ప్రతినిధులు

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారత వీరత్వానికి ప్రతీకగా నిలిచిన యోధుడు ఛత్రపతి శివాజీ అని గాంధీ మందిరం కమిటీ సభ్యులు అన్నారు. సోమవారం నగరంలో గాంధీ మందిరంలో చత్రపతి శివాజీ మహారాజ్ 397వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మందిర కమిటీసభ్యులు మాట్లాడుతూ చత్రపతి శివాజీ దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, రాజశేఖర్, గాంధీ మందిర ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, నటుకుల మోహనరావు, హారిక ప్రసాద్ పాల్గొన్నారు

టిడిపితోనే బిసిలకు న్యాయం

కవిటి: టిడిపితోనే బిసిలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కోకన్వీనర్ కొర్రాయి వాసుదేవరావు అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలో సోమవారం జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం అన్ని రంగాల్లో బిసిలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బిసిలకు పెద్దపీట వేసి వారికి అన్నిరంగాల్లో అండగా నిలిచినట్టు చెప్పారు.

మాట్లాడుతున్న వెంకన్నచౌదరి

టిడిపి పూర్వ వైభవానికి కృషి

పలాస: టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకన్నచౌదిరి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతోను, కార్యకర్తలతో, బూత్ కమిటీ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నగారా మోగే సమయం ఆసన్నమైందని, దీనికి అంతా సిద్ధం కావాలని అన్నారు. అన్నీ మండలాలు, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో టిడిపి అనుకూల పవనాలు వీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పేరుకట్ల విఠల్‌రావు, బడ్డ నాగరాజు, సూరాడ మోహనరావు, నవీన్, రవిశంకర్ గుప్త పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం

లావేరు: మండలం గుమ్మాడం గ్రామానికి చెందిన యాండపల్లి చిన్నారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి టిడిపి యువ నాయకుడు మజ్జి రామూర్తి సోమవారం పరామర్శించారు. అనంతరం తనవంతు సాయంగా రూ. వెయ్యి నగదు, రెండు బస్తాల బియ్యాన్ని అందజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి భవిష్యత్‌లో అండగా ఉంటానని తెలిపారు.

వాలంటీర్లు ప్రజా వారియర్లు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లకు ప్రధాన శత్రువులు గ్రామ, వార్డు వాలంటీర్లేనని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు ఆధ్వర్యాన వాలంటీర్లకు సోమవారం సన్మానించారు. మండలంలోని 27 సచివాలయ పరిధిలోని 419 మంది వాలంటీర్లకు 109 మందికి సేవావజ్ర, 5 మందికి సేవారత్న, 5 మంది సేవామిత్ర అవార్డులను అందజేజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు కాదు.. ప్రజా సేవ వారియర్లయని కొనియాడారు. అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న శ్రీనివాస్

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి

మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపితోనే గ్రామాల అభివృద్ధి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని బంజీరుపేటలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో రెండు నెలల్లో ఎన్నికలకు సిద్ధం అవుతుందని వ్యాఖ్యానించారు. ఐదేళ్ల జగన్ పాలనలో అన్ని తరగతి వరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బిసిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే బిసిలకు రక్షణ చట్టాన్ని తీసుకొస్తామన్న హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి శైలజ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలోని సురంగ్ రాజా క్రీడా మైదానంలో ఆక్రమణలు తొలగించాలని క్రీడాకారులు కోరారు. ఈ మేరకు డిటి గురుప్రసాద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ రోజురోజుకీ క్రీడా మైదానంలో ఆక్రమణలు పెరుగుతున్నాయని అన్నారు. రెవెన్యు అధికార యంత్రాంగం చొరవ తీసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వేలాది మంది క్రీడాకారులకు వెలుగునిచ్చిన క్రీడా మైదానం ప్రస్తుత పరిస్థితుల్లో ఆక్రమణ జోరు కొనసాగుతోందన్నారు. ఇప్పటికీ నియంత్రించకపోతే సువిశాల ప్రాంగణంలో చిన్నబోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు కె.పాపారావు, ఢిల్లీ, ఎం.చిరంజీవి, బాబ్జీ, బి.వెంకటరమణ, లోహిదాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం అదజేస్తున్న క్రీడాకారులు

పక్కాగా రికార్డుల నిర్వహణ

కవిటి : మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రమణ

ప్రజాశక్తి- పలాస

గ్రామ పంచాయతీ, సచివాలయల నిర్వహణ రికార్డులు సక్రమంగా ఉండాలని పలాస డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో చేపడుతున్న ఖర్చులు, ఆదాయ వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చులు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తప్పని సరిగా తయారు చేసి ఆమోదించుకోవాలన్నారు. ఇంటి పన్నులు వసూళ్ల ఆన్‌లైన్ విధానంలో చేయాలన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

కవిటి: పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు త్వరితగతిన పూర్తి చేయాలని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ సూచించారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎం విశ్వకర్మ దరఖాస్తులు పారదర్శకంగా పరిశీలించి ఆమోదించాలని సూచించారు. పిఎఫ్ఎంఎస్ ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులు చెల్లింపులు పూర్తి చేసి ఇంటి పన్నుల వసూలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీపాణిగ్రాహి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం తారకేశ్వర పండా

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్లస్ టూ ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అన్నారు. జిల్లా స్థాయి గిక్స్ ఆటల పోటీల్లో మహిళా కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను సోమవారం అభినందించారు. విద్యార్థులు జ్యోతి, శైలజ, త్రిష, శాంతి తదితరులకు మోమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు ద్వారా విద్యార్థులకు మానసిక ఒత్తిడిని జయించే అవకాశం ఉంటుందని అన్నారు. శారీరక పెరుగుదల వికాసానికి ఆటలు చాలా మంచిదన్నారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయుడు గజేంద్రకు అభినందిస్తూ... మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

లారీడ్రైవర్లకు నేత్ర వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం: వాహన చోదకులు దృష్టి లోపం లేకుండా చూసుకోవాలని రవాణా శాఖ అధికారి ఎం.వెంకటరావు అన్నారు. స్థానిక రవాణా శాఖ చెక్‌పోస్టు వద్ద సోమవారం లారీడ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లారీడ్రైవర్లు ప్రతి మూడు నెలలకొకసారి నేత్ర వైద్య పరీక్షలు పరీక్షలు చేయించుకోవాలన్నారు. సోంపేట ఆరోగ్య వరం నేత్ర వైద్య ఆస్పత్రి వైద్యులు పొందర ఉగ్రసేన, హేమలత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యు.దుర్గాప్రసాద్, కానిస్టేబుల్ వెంకటరావు, చంద్రారెడ్డి, మోహనరావు, వైద్యసిబ్బంది రామకృష్ణ, పీటర్ శ్రీను, రవికుమార్ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న జనసేన నాయకులు

తాగునీరు అందించాలి

పలాస: పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపాలిటీలో తాగునీరు అందించలేని స్థితిలో ఉన్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నీలాపురంలో జనం జనం... జనసేన ప్రభంజనం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి, డ్రెయినేజీ, రోడ్ల అధ్వానంగా ఉన్నాయని అన్నారు. టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీరు సరఫరా చేసి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లావేటి సురేష్, భైరిశెట్టి పవన్ కళ్యాణ్, రంధి షణ్ముఖ, ఉదయ్ కిరణ్, కూర్మాపు వాసు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వజ్రపుకొత్తూరు: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండలంలోని పల్లిసారథి, చినవాంకలోని పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. పల్లిసారథిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం పరిశీలించి బిఎల్‌ఒలకు తగిన సూచనలు చేశారు. ఓటర్లకు, వికలాంగులకు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎన్నికల సిబ్బందికి మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని సూచించారు. ఆయనతో పాటు రెవెన్యూ సహాయకులు పవిత్ర, రెవెన్యూ అధికారులు రామకృష్ణ, వసంతరావు ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్